క్లుప్తంగా

డీఆర్‌డీఏ ఉద్యోగికి డాక్టరేట్


టి అశోక్‌కుమార్

నెహ్రూనగర్: డీఆర్‌డీఏ లైవ్‌లీ హుడ్ జిల్లా మేనేజర్ తలకాయల అశోక్‌కుమార్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ డాక్టర్ కె.సరళదేవి నేతృత్వంలో సుస్థిర జీవనోపాధుల మీద చేసిన అధ్యాయనానికి గాను డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో అశోక్‌కు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ డాక్టర్ ప్రదానం చేశారు.

అక్కే స్కూల్లో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్ ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అక్కే స్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సేవాభావాన్ని అలవర్చేందుకు ఇంటరాక్ట్ క్లబ్‌ను ప్రారంభించినట్లు పాఠశాల డైరెక్టర్ నందమూరి దీప్తి తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా కె.హవీష్, కార్యదర్శిగా బి.బృంద నియమితులయ్యారు. వీరి ఆధ్వర్యంలోని బృందంలో 20 మంది విద్యార్థులను సభ్యులుగా చేర్చుకుని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు డైరెక్టర్ దీప్తి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ భాస్కరరావు, ఇంటరాక్ట్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మోహన్, రోటరీ ఆదర్శ్ క్లబ్ సభ్యులు ఎం.అనూరాధ, జయశ్రీ, వాణి, బి.రోహిణిదేవి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్‌బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బుధవారం ఇన్‌ట్యాక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆర్టీసీ కాలనీకి చెందిన సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు తెలిపారు. గుంటూరు నగరంలోని 20 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీపడగా, తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, విజేతలుగా నిలవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. భారతదేశంలోని ప్రాచీన కట్టడాలు, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలపై అనేక ప్రశ్నలతో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన టెన్త్ విద్యార్థులు జావేద్ అక్బర్, నవేద్ బాషా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఇన్‌ట్యాక్ ఇన్‌చార్జి కో-కన్వీనర్ రవి శ్రీనివాస్, పూర్ణచంద్రరావు, పాఠశాల డైరెక్టర్ ఎం.శేషకుమారి, సాయి శ్రీకర్, హెచ్‌ఎం మీనాక్షి, ప్రిన్సిపాల్ కళ్యాణి, ఎం.లక్ష్మి, ఎంఎల్ భారతి విద్యార్థులను అభినందించారు.

స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దాలి

డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు



ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీలో ప్రతి వార్డునూ స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని గుంటూరు డివిజన్ డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని 10, 11, 12 వార్డులను స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బుధవారం ఆయా వార్డుల్లో ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.శివపార్వతితో కలిసి డోర్ టు డోర్ డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఐటీసీ, ఫినిష్ సొసైటీ సహకారంతో ప్రతి ఇంటికీ చెత్తబుట్టలు, పొడి వ్యర్థాల నిర్వహణకు జూట్ బ్యాగులు అందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు కరపత్రాలను అందించాలని సెక్రటరీ షేక్ ఖాజాకు సూచించారు. ప్రతి రోజూ క్లాప్‌మిత్రలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.రమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ పర్సన్ డబ్బూరి శ్రీనివాసరావు, ఐటీసీ జిల్లా కో ఆర్డినేటర్ యశ్వంత్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక తాగునీటి సరఫరా సులువు

- నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్‌కు అనుసంధానం
- 900 ఎంఎం డయా పైపు లైను ఏర్పాటు
- గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైన పనులు
- ఎన్నికల కోడ్‌, రైల్వే ట్రాక్ వద్ద ఇబ్బందులతో ఆగిపోయిన పనులు
- ఇప్పటికి పనులు పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికారులు


రెండు రోజుల క్రితం పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు (ఫైల్)

నెహ్రూనగర్: నగర ప్రజలకు తాగునీటి సమస్య తీరనుంది. పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు లబ్ధిచేకూరనుంది. ఎప్పటి నుంచో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా అధికారులు పనులు పూర్తి చేశారు. 800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 డయా పైపులైన్ ఏర్పాటు చేశారు. సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ వద్ద కొన్ని ఇబ్బందులు రావడం.. ఈ లోపు సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో సుమారు 90 మీటర్లు మేర కొత్త పైపులైన్ వేసే(రైల్వే ట్రాక్ కింద నుంచి నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల వరకు) పనులు ఆగిపోయిన విషయం తెలిసిందే.

గత ప్రభుత్వ హయాంలోనే..

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్‌కు గతంలో 800 ఎంఎం డయా పైపులైను మీద తాగునీటి సరఫరా జరిగేది. అయితే ఈ పైపులైను పురాతన పైపులైను కావడంతో తరుచూ లీకులు ఏర్పడుతూ ఉండేవి. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి సారి కొన్ని లక్షలు ఖర్చు పెట్టి లీకులకు మరమత్తులు చేయడం...పంపింగ్ జరిగే సమయంలో ఒత్తిడి పెరిగి మరమత్తులు చేసిన లీకులు తిరిగి లీకులు పడుతూ వస్తూ ఉండేవి. దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు గాను గత ప్రభుత్వ హయాంలోనే చర్యలు చేపట్టారు. పనులు పూర్తి చేసి సంజీవయ్యనగర్ రైల్వే గేటు దాటిన తరువాత 800 డయా పైపులైన్ నుంచి 900 డయా పైపులైన్‌కు రెండేళ్ల క్రితం ఇంటర్ కనెక్టు చేశారు. ప్రస్తుతం నీటి సరఫరా చేస్తున్నారు.

హెచ్‌ఎల్‌ఆర్‌కు రోజుకు 50 నుంచి 60 ఎంఎల్‌డీ వాటర్ సరఫరా

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్ వాటర్ ట్యాంకులకు ప్రతి రోజు 50 నుంచి 60 ఎంఎల్‌డీ(మిలియన్స్ ఆఫ్ లీటర్ పర్ డే) సరఫరా అవుతూ ఉండేది. ఈ లీకుల వలన ప్రతి రోజు 10 ఎంఎల్‌డీ వాటర్ వృథాగా పోయింది. దీంతో హెచ్‌ఎల్‌ఆర్ వాటర్ ట్యాంకుల పరిధిలో టెయిల్ ఎండ్ పాయింట్(వాటర్ ట్యాంకులకు దూరంగా ఉండే ప్రాంతాలు) గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, స్వర్ణాంధ్రనగర్, బుడ జంగాల కాలనీ, జన్మభూమి నగర్, వికాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివాసముండే సుమారు 30 వేల మందికి తాగునీటి సమస్య వస్తుండేది. ఈ పైపులైన్ వేయడం ద్వారా తాగునీటి సమస్యకు చెక్ పెట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

వార్డు సచివాలయ సెక్రటరీలు సస్పెన్షన్

నెహ్రూ నగర్: విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వార్డు సచివాలయ సెక్రెటరీలను సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సదరం సర్టిఫికెట్లను ప్రస్తుత ప్రభుత్వం సరఫరా చేసిన స్టేషనరీతో కాకుండా గత ప్రభుత్వంలో అందించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫొటోతో ఉన్న స్టేషనరీపై ప్రింట్ చేసి సర్టిఫికెట్ అందించిన 127 వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రొసెసింగ్ సెక్రెటరి ఆర్.రామ బిల్వికాదేవి, వెల్ఫేర్ సెక్రటరీ వి.రవికుమార్‌లను విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. నోడల్ అధికారి కె.సాంబశివరావు, అడ్మిన్ కార్యదర్శి ఎ.నాగమణిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇప్పటికే వార్డ్ సచివాలయ పాత సర్టిఫికెట్లను జీఎంసీకి సరెండర్ చేయాలని, నేమ్ బోర్డ్‌లను మార్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రతి సచివాలయంలో నిర్దేశిత నేమ్ బోర్డ్ ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కాని కొందరు కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. నోడల్ అధికారులు ప్రతి రోజు తమకు కేటాయించిన సచివాలయాల్లో పర్యటించి, కార్యదర్శుల పనితీరుని పర్యవేక్షణ చేస్తూ ప్రతి వారం నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. డెప్యూటీ కమిషనర్లు ర్యాండమ్ గా ఆకస్మిక తనిఖీలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రోడ్లపై వ్యాపార సంస్థల పార్కింగ్ నిషేధం

కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో ప్రధాన రహదారులు వ్యాపార సంస్థల పార్కింగ్ వినియోగానికి కాదని, ప్రజల వాహనాలు రాకపోకలకు మాత్రమేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసీ కాలేజి రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్ల ఆక్రమణలను, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో హోటల్స్, షాపింగ్ మాల్స్ వంటి సంస్థలు తమ భవన ప్రాంతాల్లోనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని, అలా కాకుండా ట్రాఫిక్‌కి అడ్డుగా రోడ్లను ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణలు లేకుండా గ్రామ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగ ఆక్రమణ నిర్మూలన దళం రోడ్ల ఆక్రమణల తొలగింపుపై మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇప్పటికే శంకర్ విలాస్ వంతెన పనుల వలన నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటే రోడ్ల ఆక్రమణ చేయడం సరికాదన్నారు. జేకేసీ కాలేజ్ రోడ్‌లో పైప్ లైన్ లీకు వర్కుని పరిశీలించి లీకు మరమ్మతులు నాణ్యతగా, వేగంగా చేయాలన్నారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్‌లో పర్యటించి రోడ్ల పక్కన వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని, సెంట్రల్ డివైడర్‌లో పచ్చదనం పెంపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

కిల్కారి కాల్స్ గర్భిణులకు ప్రయోజనం


కిల్కారి కాల్స్ సేవల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న రాజు

గుంటూరు మెడికల్: మాత శిశు మరణాలు తగ్గించటానికి కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్స్ పథకాన్ని ప్రవేశపెట్టటం జరిగిందని కిల్కారి ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.రాజు అన్నారు. స్థానిక వసంతరాయపురం సచివాలయంలో బుధవారం జరిగిన వ్యాక్సినేషన్ సెషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సినేషన్‌కు వచ్చిన గర్భిణులు, బాలింతలకు కిల్కారి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కిల్కారి వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గర్భిణి 4వ నెల నుంచి బిడ్డ పుట్టిన తరువాత సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ వస్తాయన్నారు. వారానికి ఒక సారి వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నెంబర్ 911600103660ని గర్భిణులు, బాలింతలు మొబైల్ సేవ్ చేసుకుని, కాల్స్ వచ్చినపుడు లిఫ్ట్ చేసి సమాచారని వినగలుగుతారన్నారు. మళ్లీ సమాచారాన్ని వినాలి అనుకుంటే 14423కి కాల్ చేసి వినవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని కోరారు. కిల్కారి కాల్ వచ్చినపుడు పూర్తిగా సమాచారాన్ని వినాలి అని కోరారు. ఈ సెషన్‌లో ఏఎన్‌ఎం కె.కుమారి ఉన్నారు.

విద్యార్థులు ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డాక్టర్ కీర్తి గన్నే

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు చెందిన వైద్య నిపుణురాలు కీర్తి గన్నే పేర్కొన్నారు. బుధవారం లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలలో శ్రేష్ఠ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కీర్తి గన్నేతో పాటు డాక్టర్ అఖిల్ రోహన్ లేళ్ల, డాక్టర్ కనకాల శ్రాన్‌మూర్తి విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ జాగ్రత్తలను వివరించారు. మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమన్నారు. అధిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు గల నివారణోపాయాలను తెలియజేశారు. బాలికలలో రక్తహీనతను అధిగమించేందుకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఎన్నో వ్యాధులను దూరం చేసుకోవచ్చునని తెలిపారు. అదే విధంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డి. దుర్గాశ్యామ్, కో-ఆర్డినేటర్లు దిల్ జహాన్, టి.శ్రీదేవి, ఇన్‌చార్జి కె.హరిప్రియ పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

పెదకాకాని: పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహ సముదాయంలో అమరావతి హాస్టల్ వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పునరంకితం కావాలని, విద్యార్థుల సామూహిక కృషితోనే సాధ్యమవుతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వసతి గృహాల సముదాయాలలో కల్పించడంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్, వర్సిటీ బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లికార్జున, విద్యార్థులు, సిబ్బంది హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో బాలుర వసతి గృహాల అడిషనల్ వార్డెన్లు డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ బాలమురళి, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఎన్.బాబు, ఏఆర్ పార్థసారథి, డాక్టర్ వెంకట శేఖర్, డాక్టర్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా సంజీవయ్య నగర్ రైల్వే గేట్ మీదుగా రాకపోకలు

నెహ్రూ నగర్: సంజీవయ్య నగర్ రైల్వే గేట్ మీదగా బుధవారం మధ్యాహ్నం నుంచి యథావిధిగా రాకపోకలు కొనసాగనున్నాయి. పైపులైను ఇంటర్ కనెక్షన్ పనుల నిమిత్తం గత నెల 30వ తేదీ నుంచి రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇంటర్ కనెక్షన్ పనులు ఒకటో తేదీ సాయంత్రాన్ని పూర్తయ్యాయి. ఈ పనుల వలన రైల్వే కేబుల్స్ కట్ కావడంతో రెండో తేదీ సదరు పనులను పూర్తి చేసుకొని, బుధవారం మధ్యాహ్నానికి గుంత పూడ్చి వేశారు. దీంతో వాహనదారులు రైల్వే గేట్ మీదగా రాకపోకలు సాగించారు.

బహిరంగంగా మద్యం తాగిన 9 మందిపై కేసు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం తాగిన 9 మందిపై అరండల్‌పేట పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 1వ లైన్ రైల్వే స్టేషన్ ఎదురు ఉన్న మద్యం దుకాణాల వద్ద రోడ్డుపై బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం, మత్తు పదార్థాలు తాగి స్థానికులతో అసభ్యకంగా, ఆటంకంగా మారితే చట్ట పరమైన చర్యలు తీవ్రతరంగా ఉంటాయని స్టేషన్ సీఐ ఆరోగ్య రాజు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రత్తిపాడు: రోడ్డు ప్రయాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన కొలసాని శ్రీనివాసరావు (35) బుధవారం రాత్రి గుంటూరు నుంచి అన్నపర్రుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం మర్రి కోల్డ్ స్టోరేజీ సమీపంలో గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కొలసాని శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ నరహరి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తి..

తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి బుధవారం మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడు లేత గోధుమ రంగు షర్టు, కాఫీ పొడి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తెనాలి జీఆర్పీ పోలీసులు రైల్లో నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని జేబులో సెల్‌ఫోన్ చార్జర్, తాళం చెవి ఉన్నాయి. షర్టు కాలర్‌పై వీనస్ టైలర్స్ లంబాడీపేట విజయవాడ అని లేబుల్ ఉంది. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.వెంకటాద్రిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

■ గుంటూరు తూర్పు నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం జరిగింది. యువజన విభాగం అధ్యక్షుడిగా షేక్ సుభాని, మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఎం.ఉషారాణి, బీసీ విభాగం అధ్యక్షుడిగా గుమ్మా గోపి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ లియాఖత్, మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా మల్లవరపు రమ్య, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా నక్కా రవి, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి చంద్రమోహన్, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడిగా పఠాన్ ఆజ్మతుల్లా ఖాన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అద్దేపల్లి శ్రీనివాసరావు, చేనేత విభాగం అధ్యక్షుడిగా యంగాల శ్రీధర్, వైఎస్సార్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా తలపతి చెన్నయ్య, లీగల్ విభాగం అధ్యక్షుడిగా షేక్ షన్ను, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా ఐ.వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా చింతగుంట్ల సాగర్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా దాసరి గణేష్, ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నారకట్ల శ్రీనివాసరావు, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా పుల్లా కిషోర్, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా కీసరి ఆదినారాయణరెడ్డిలను నియమించారు.

104 ఎంప్లాయీస్ సమస్యలు పరిష్కరించాలి


డీఎంహెచ్‌ఓ కొర్రా విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న 104 సంఘ నాయకులు

గుంటూరు మెడికల్: 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గుంటూరు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందించారు. స్థానిక కార్యాలయంలో యూనియన్ నేతలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుంచి ఉద్యోగులకు తగ్గించిన వేతనాలతో సహా చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. గత యాజమాన్యమైన అరబిందో నుంచి రావాల్సిన అన్ని బకాయిలను ఉద్యోగులకు చెల్లించే విధంగా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. 104 లో స్లాబ్ పద్ధతి అమలు జరపాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలవుతున్న సెలవులు, ఎర్న్ లీవులు, పబ్లిక్ హాలిడేలు, గుర్తింపు కార్డులు, పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. వాహనాలకు సరిపడినటువంటి సిబ్బందిని నియమించాలని, అవసరమైనటువంటి బఫర్ జోన్ ఉద్యోగులను నియమించాలని కోరారు. వాహనాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు గురయ్యాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని చెప్పారు. రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్క ఉద్యోగికి కల్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ పూర్తిస్థాయిలో ఇచ్చే విధంగా, ఈఎస్‌ఐ దాటిన వారికి హెల్త్ కార్డులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. డీఎంహెచ్‌కు వినతిపత్రం అందించిన వారిలో గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్షుడు గోరంట్ల సురేష్ కుమార్, కార్యదర్శి ఆలూరి శ్రీహర్ష, కోశాధికారి ఐ.నాగులు, బి.బాలకృష్ణ, విజయ్ కుమార్, ఏడుకొండలు, సురేష్, సాయిరాం పాల్గొన్నారు.

పెరిగిన మిర్చి కార్మికుల వేతనాలు


కలెక్టరేట్ ఆవరణలో మాట్లాడుతున్న నళినీకాంత్

సీఐటీయూ మిర్చి క్లస్టర్ కన్వీనర్ నళినీకాంత్

గుంటూరు వెస్ట్: కార్మికుల కష్టాన్ని విస్మరించే ప్రభుత్వాలు మనుగడ కొనసాగించవని సీఐటీయూ మిర్చి క్లస్టర్ కన్వీనర్ నళినీకాంత్ పేర్కొన్నారు. కొన్ని రోజులుగా మిర్చియార్డు కార్మికుల దినసరి వేతనాల పెంచాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు బుధవారంతో ముగిసాయి. జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తన చాంబర్‌లో కార్మిక సంఘం నాయకులతో చర్చించి కూలీ రేట్లను పెంచడానికి అంగీకరించారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ కాపలా ముఠాకు రూ.8.90, దిగుమతి ముఠాకు రూ.8.80, కొట్టు ముఠాకు రూ.13.50 పెంచారన్నారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు కూలీల రేట్లు పంచాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఆసియాలోనే అతిపెద్దదైన మార్కెట్ యార్డులో కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు యూనిఫాం, కుట్టుకూలీ, గుర్తింపు ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కూలీ రేట్లు స్వల్పంగా పెంచడం హర్షణీయమన్నారు. సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీఎఫ్‌టీయూ మద్దతు తెలిపాయన్నారు. కార్యక్రమంలో నాగ గౌడ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, రవి, రాము, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద రుద్ర ట్రస్ట్ సభ్యుల ఆందోళన



లక్ష్మీపురం: రుద్ర ట్రస్ట్ నిర్వాహకుడిపై మహిళ ఎస్‌ఐ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నగరంపాలెం పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి ట్రస్ట్ సభ్యులు నిరసనకు దిగారు. వివరాలు.. రామిరెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం గణనాథుడి నిమజ్జనానికి ఏర్పాటు చేసిన డీజే వాహనానికి డ్రైవర్‌గా రుద్ర ట్రస్ట్ నిర్వాహకుడు సుభాని వెళ్లాడు. కార్యక్రమాన్ని ముగించుకుని చుట్టుగుంట బాషా హోటల్ వద్దకు డీజే వాహనాన్ని తీసుకొచ్చాడు. అదే సమయంలో రక్షక వాహనంతో పాటు వచ్చిన నగరంపాలెం మహిళా ఎస్‌ఐ రమాదేవి ఖాళీగా ఉన్న డీజే వాహనం వద్దకు వచ్చి పాటలు పెట్టడానికి వీలు లేదని హెచ్చరించారు. అందుకు స్పందించిన సుభాని తిరుగు ప్రయాణంలో ఉన్నామని చెప్పినా వినిపించుకోకుండా ఆమె దురుసుగా కొట్టే యత్నం చేశారు. దీంతో ఎస్‌ఐ తీరుకు నిరసనగా ట్రస్ట్ సభ్యులు నగరంపాలెం పోలీసు స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచ్ సీఐ అళహరి శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రుద్ర ట్రస్ట్ సుభాని, ఎస్‌ఐ రమాదేవితో మాట్లాడి ఇద్దరి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

నూటా ఎన్నికలకు ఒక ప్యానల్ నుంచే నామినేషన్లు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపక సంఘం నూతన అసోసియేషన్ ఏర్పాటుకు సంబంధించి నిర్వహించే నూటా ఎన్నికలకు ఒక ప్యానల్ మాత్రమే నామినేషన్లు దాఖలు చేసినట్లు బుధవారం ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్ తెలిపారు. ఆచార్య పి.బ్రహ్మజీరావు అధ్యక్షుడిగా ఉన్న ప్యానల్ మాత్రమే వారి వారి నామినేషన్ పత్రాలను అందించడం జరిగిందన్నారు. అయితే ఈ ప్యానల్ కాకుండా మరే ప్యానల్ కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. అనంతరం ఎన్నికల వివరాలు వెల్లడిస్తామన్నారు.